క్లుప్తంగా

ఎర్నిమాంబకు ప్రత్యేక పూజలు


ఎర్నిమాంబ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేస్తున్న పూజారి విజయమ్మ

కంచరపాలెం : జ్ఞానాపురం కూడలిలో వెలసిన ఎర్నిమాంబ అమ్మవారి ఆలయం శ్రావణ శుద్ధ చతుర్దశి ఆదివారాన్ని పురస్కరించుకుని భక్తులతో కిటకిటలాడింది. ఈవో డీవీఎస్ సురేష్ బాబా ఆధ్వర్యంలో ఆలయ పూజారి వాసుపల్లి విజయమ్మ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి, హారతి పూజలు చేశారు. అర్చకులు శ్రీకాంత్‌శర్మ ఉదయం నుంచి అమ్మవారికి కుంకుమ పూజలు, విశేషార్చనలు, అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ప్రత్యేక ఉచిత దర్శనాలతో పాటు రూ. 10, రూ. 50 కౌంటర్లు ఏర్పాటు చేశారు. భక్తుల వసతులను ఈవో సురేష్‌బాబా పర్యవేక్షించారు. ఆలయ సిబ్బంది రామకృష్ణ, ప్రసాద్, స్వచ్ఛంద సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం వాసికి ఆశ్రయం



నిరాశ్రయుల వసతి గృహానికి చేరుకున్న చొప్పల రాము

సీతమ్మధార : ఆరోగ్యం బాగు లేని వ్యక్తికి ఏయూటీడీ స్వచ్ఛంద సంస్థ నిరాశ్రయుల వసతి గృహంలో ఆశ్రయం కల్పించారు. వివరాలిలా ఉన్నాయి. ఏయూటీడీ స్వచ్ఛంద సంస్థ కార్యదర్శి ప్రగడ వాసుకు శ్రీకాకుళానికి చెందిన చొప్పలరాము (55) అనారోగ్యంతో బాధపడుతూ కనిపించాడు. వివరాలు సేకరించగా భార్యాపిల్లలు ఉండి కూడా అతను ఒంటరివాడయ్యాడు. అతను కాలి ఇన్ఫెక్షన్‌తో బాధపడుతున్నాడు. ఆయనను ద్వారకానగర్ టీఎస్ఆర్ కాంప్లెక్సులో గల జీవీఎంసీ ఏయూటీడీ నిరాశ్రయుల వసతిగృహానికి తరలించారు.

కావాలనే 'ఉక్కు' నిర్వీర్యం


మాట్లాడుతున్న కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి

అగనంపూడి: విశాఖ ఉక్కు స్టీల్‌ప్లాంట్ రాష్ట్ర ప్రజల ఆస్తిగా భావిస్తున్నామని, లక్షల మందికి ప్రత్యంగా, పరోక్షంగా ఉపాధి కల్పించే సంస్థను కేంద్ర ప్రభుత్వం తనకు నచ్చిన వారికి కట్టబెట్టాలని చూస్తే ప్రజల నుంచి తిరుగుబాటు తప్పదని, ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయాలని జీవీఎంసీ కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి డిమాండ్ చేశారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు నిరసనగా ఉక్కు పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో కూర్మన్నపాలెంలో కొనసాగుతున్న రిలే దీక్షా శిబిరంలో పాల్గొని సంఘీభావం తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 32 మంది అమరుల త్యాగఫలితం విశాఖ ఉక్కు కర్మాగారమన్నారు. తెలుగు ప్రజల మనోభావాలతో ముడిపడి ఉన్న స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరించాలని భావిస్తే ఛీత్కారం తప్పదన్నారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోమటి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఐదేళ్ల క్రితం లాభాలతో పయనించిన విశాఖ ఉక్కును పరిపరి విధాలుగా ఇబ్బందులకు గురిచేసి నేడు ఉత్పత్తిని హీనస్థితికి తీసుకువెళ్లడం, కేవలం ప్రైవేటు వ్యక్తుల చేతుల్లో పెట్టడానికేనని ప్రజలకు తెలుసన్నారు. ముడిసరుకును సరఫరా చేయకుండా చివరికి ఉత్పత్తి నిలిపివేసే స్థితికి తీసుకువెళ్లడం దారుణమన్నారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే ముడిసరుకు సరఫరా చేసి సొంత గనులు కేటాయించాలని, తక్షణ సాయంగా మూడువేల కోట్ల నిధులు విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు బొడ్డు పైడిరాజు, డి.ఆదినారాయణ, మంత్రి రాజశేఖర్, ఎస్.రామారావు, వరసాల శ్రీనివాసరావు, నీరుకొండ రామచంద్రరావు, కరణం సత్యారావు, ఎం.కె.రెడ్డి, కె.పరంధామయ్య, ఎల్లేటి శ్రీను, కార్పొరేటర్ ఇమ్రాన్ పాల్గొన్నారు.

కానరాని హాకర్స్ జోన్లు


తహసీల్దార్ కార్యాలయం ఎదురుగా నక్కవానిపాలెంలో దుకాణాలు


సీతమ్మధార రైతుబజార్ రోడ్డు పక్కన దుకాణాలు

- చిరు వ్యాపారులకు రోడ్లు, ఫుట్‌పాత్‌లే దిక్కు
- పట్టించుకోని జీవీఎంసీ జోనల్ అధికారులు

సీతమ్మధార : చిరు వ్యాపారుల గోడు జీవీఎంసీ అధికారులు పట్టించుకోకపోవడంతో వారికి ఫుట్‌పాత్‌లు, రోడ్లే దిక్కవుతున్నాయి. స్వయం ఉపాధి కోసం వేలాది మంది ఫుట్‌పాత్ మీద, తోపుడు బండ్ల మీద వ్యాపారాలు చేస్తున్నారు. జీవీఎంసీ జోన్ – 3 పరిధిలోని పలు ప్రాంతాల్లో అధిక సంఖ్యలో చిరు వర్తకులు వున్నారు. టిఫిన్, కూరగాయలు, ఇళ్లలో వాడే పలు రకాల సామగ్రి విక్రయిస్తూ వీరంతా కుటుంబాలను పోషించుకుంటున్నారు. 2019లో జోన్ – 3 పరిధిలో సుమారు 5,166 మంది చిరు వర్తకులు తమ పేర్లు అధికారుల వద్ద నమోదు చేసుకుని, గుర్తింపు కార్డులు తీసుకున్నారు. కొన్నేళ్ల క్రితం జోన్ పరిధిలోని సీతమ్మధార రైతుబజార్ పక్కన ఒకే ఒక్క హాకర్స్ జోన్ ఏర్పాటు చేశారు. ఇంకా వేలాది మందికి హాకర్స్ జోన్లు ఏర్పాటు చేయాల్సి వుంది.

ప్రభుత్వ స్థలాలున్నా చర్యలు శూన్యం

జోన్ – 3 పరిధిలోని ఆరిలోవ, ఎంవీపీ కాలనీ, సీతమ్మధార, నక్కవానిపాలెం, సత్యం జంక్షన్, రేసపువానిపాలెం, మద్దిలపాలెం, రేసపువానిపాలెం, శివాజీపాలెం, ఇసుకతోట తదితర ప్రాంతాల్లో అధిక సంఖ్యలో చిరు వ్యాపారాలు చేసుకునే వారున్నారు. హాకర్స్ జోన్ లేకపోవడంతో వీరు రోడ్ల పక్కనే వ్యాపారాలు చేసుకోవాల్సి వస్తోంది. చిన్నపాటి వర్షం కురిసినా వ్యాపారం సాగక కుటుంబ పోషణ కష్టతరమవుతోందని విచారం వ్యక్తం చేస్తున్నారు. జోన్ – 3 పరిధిలో పలు చోట్ల జీవీఎంసీ, రెవెన్యూ శాఖ స్థలాలున్నా హాకర్స్ జోన్లు మాత్రం ఏర్పాటు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సీతమ్మధార తహసీల్దార్ కార్యాలయం ఎదురుగా నక్కవానిపాలెంలో ఖాళీ స్థలంలో ఎందరో చిరు వర్తకులు తోపుడు బండ్ల మీద వ్యాపారాలు చేసుకుంటున్నారు. ఇది రెవెన్యూ శాఖకు చెందిన స్థలమే. ఇలాంటి స్థలాలు గుర్తించి హాకర్స్ జోన్స్ ఏర్పాటు చేస్తే ఎంతో ప్రయోజనకరమని చిరు వ్యాపారులు అంటున్నారు.


నార్త్ ఎక్స్‌టెన్షన్‌లో రోడ్డు పక్కన దుకాణాలు

హాకర్స్ జోన్ నిర్వహణ గాలికి...

సీతమ్మధార రైతు బజార్ సమీపంలో కొన్నాళ్ల కిందట ఏర్పాటు చేసిన హాకర్స్‌జోన్ నిర్వహణ అధ్వానంగా వుందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. గతంలో ఇక్కడ దుకాణాల కేటాయింపు మీద కూడా పలు ఆరోపణలు వున్నాయి. రాజకీయ పైరవీలు చేసిన వారికే దుకాణాలు ఇచ్చేశారని చిరు వ్యాపారులు అప్పట్లో ఆందోళనలు చేశారు. హాకర్స్ జోన్‌లో మటన్, చికెన్, కూరగాయల వ్యాపారులకు దుకాణాలు కేటాయించారు. అయితే వీరిలో అర్హులకు కాకుండా అనర్హులకే దుకాణాలు ఇచ్చేశారని పెద్ద ఎత్తున ఆరోపణలు వున్నాయి. ప్రస్తుతం హాకర్స్ జోన్ నిర్వహణను కూడా ఎవరూ పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. మరో వైపు సీతమ్మధార రైతు బజార్ చుట్టూ చాలా మంది తోపుడు బళ్లపై వ్యాపారాలు చేసుకుంటున్నారు. ఫలితంగా ఇక్కడ తరచూ ట్రాఫిక్ స్తంభించిపోతోంది. హాకర్స్ జోన్ ఏర్పాటు చేసి తోపుడుబండి వర్తకులకు ఉపాధి, భద్రత పెంచాల్సి వున్నా జోనల్ అధికారులు ఆ దిశగా అడుగులు వేయడం లేదు. జిల్లా యంత్రాంగం, జోనల్ అధికారులు పట్టించుకోకపోవడంతో ఉపాధికి భద్రత కరువవుతోందని ఆందోళన వ్యక్తమవుతోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించాలని కోరుతున్నారు.

ఒకటి నుంచి ఏఐటీయూసీ సమితి సమావేశాలు


గోడపత్రిక ఆవిష్కరిస్తున్న ఏఐటీయూసీ నాయకులు

మురళీనగర్ : విశాఖ నగరంలో సెప్టెంబర్ 1 నుంచి 3 వరకు మూడు రోజులపాటు నిర్వహించనున్న ఏఐటీయూసీ జాతీయ సమితి సమావేశాలకు ప్రజలు అత్యధిక సంఖ్యలో తరలి రావాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి పాత్రపల్లి చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆదివారం 48వ నంబరు బస్టాప్ వద్ద గోడ పత్రిక ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 32 మంది అమరుల త్యాగాల ఫలితంగా ఏర్పాటైన విశాఖ ఉక్కు కర్మాగారాన్ని నరేంద్ర మోదీ ప్రభుత్వం కార్పొరేట్ పెద్దలకు కట్టబెట్టడానికి ప్రయత్నిస్తోందని ఆరోపించారు. స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని డిమాండ్ చేశారు. స్వాతంత్ర్యానికి పూర్వం బ్రిటిష్ వారితో పోరాడి కార్మిక వర్గం సాధించుకున్న 44 చట్టాలను నాలుగు కోడ్‌లుగా కుదించి కార్మికుల హక్కులను కాలరాసే విధంగా కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తోందన్నారు. భవిష్యత్ పోరాట కార్యాచరణను సమావేశాల్లో చర్చిస్తామన్నారు. ఏఐటీయూసీ సీనియర్ నాయకుడు, బిల్డింగ్ వర్కర్స్ జిల్లా ఉపాధ్యక్షుడు కె.గోపాలం, జిల్లా సమితి సభ్యుడు ఎస్.నాగభూషణరావు పాల్గొన్నారు.

ఖాతాదారుల ప్రయోజనమే లక్ష్యం


సీతమ్మధార యూనియన్ బ్యాంకు రీజినల్ కార్యాలయం వద్ద విశ్రాంత ఉద్యోగులు

సీతమ్మధార : యూనియన్ బ్యాంకు ఖాతాదారుల ప్రయోజనమే లక్ష్యంగా సేవలు అందిస్తామని బ్యాంకు జోనల్ మేనేజర్ షాలీన్ మీనస్ తెలిపారు. ఈ మేరకు యూనియన్ బ్యాంకు ప్రాంతీయ కార్యాలయంలో విశ్రాంత ఉద్యోగుల ఆత్మీయ సదస్సు ఆదివారం నిర్వహించారు. ముందుగా బ్యాంకు జనరల్ మేనేజర్ జ్యోతి ప్రజ్వలన చేసి సదస్సు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విశ్రాంత ఉద్యోగులు బ్యాంకు పురోభివృద్ధికి సహాయ, సహకారాలు అందివ్వాలని కోరారు. బ్యాంకు డీజీఎం, రీజినల్ అధికారి ఆర్.నర్సింహకుమార్ మాట్లాడుతూ ప్రస్తుతం డిపాజిట్లపై సీనియర్ సిటిజన్లకు 333 రోజులకు 7.9, సూపర్ సీనియర్లకు 8.15 శాతం అత్యధిక వడ్డీ అందిస్తున్నామని తెలిపారు. అనంతరం విశ్రాంత ఉద్యోగులకు జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో విశ్రాంత ఉన్నతాధికారులు ఎ.వి.రామకృష్ణారావు, జి.వాసుదేవ మూర్తి, ఎం.ఎస్.భాస్కరరావు, టి.కామేశ్వరరావు, విశ్రాంత ఉద్యోగులు రవికుమార్, టి.కృష్ణారావు, కె.రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన

కంచరపాలెం : జీవీఎంసీ 48వ వార్డు కంచరపాలెం కొండవాలు ప్రాంతంలో రోడ్లు, డ్రైనేజీ నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. బాపూజీనగర్, న్యూ శ్రీనివాస్‌నగర్, నీలకంఠనగర్‌లో జరుగుతున్న పనులను కార్పొరేటర్ గంకల కవిత ఆదివారం పరిశీలించారు. సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణంలో నాణ్యత పాటించాలని సూచించారు. వర్షాలు కురిస్తే పనులకు ఇబ్బంది లేకుండా త్వరగా పూర్తి చేయాలని ఆమె కోరారు. అనంతరం వార్డులో పర్యటించి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. కొండవాలు సమస్యలపై ప్రజలు వినతులు అందించారు. వార్డు అధ్యక్షుడు గంకల అప్పారావు, వర్క్ ఇన్‌స్పెక్టర్ నరేష్ పాల్గొన్నారు.

మార్కెట్‌లో రాఖీల సందడి


శంకరమఠం రోడ్‌లో రాఖీలు కొనుగోలు చేస్తున్న నగరవాసులు

సీతంపేట : అన్నా చెల్లెల్ల సోదర బంధానికి ప్రతీకగా నిలిచే రాఖీ పండగ జరుపుకోవడానికి మహిళలు సన్నద్ధమయ్యారు. సోమవారం పండగ కావడంతో రాఖీల విక్రయాలతో మార్కెట్‌లో సందడి నెలకొంది. ఆదివారం సెలవు రోజు కావడంతో అన్నా, తమ్ముళ్లకు కట్టేందుకు మహిళలు రాఖీలు పెద్ద ఎత్తున కొనుగోలు చేశారు. శ్రావణమాసం పౌర్ణమి రోజున రాఖీ పండగ జరుపుకోవడం ఆనవాయితీ. చిన్న, పెద్ద అనే తేడా లేకుండా అమ్మాయిలు, మహిళలు అన్నయ్యలకు రాఖీలు కట్టి తమ అభిమానాన్ని చాటుకుంటారు. నగరంలో పలుచోట్ల రాఖీల విక్రయ కేంద్రాలు ఏర్పాటు చేశారు. కొనుగోళ్లతో ఆయా విక్రయ కేంద్రాల వద్ద రద్దీ నెలకొంది. రామాటాకీస్, శ్రీనగర్, సీతంపేట, శంకరమఠం రోడ్, అక్కయ్యపాలెం, తాటిచెట్లపాలెం, కంచరపాలెం, మర్రిపాలెం ప్రాంతాల్లో ప్రధాన రహదారులు, కూడళ్ల వద్ద ప్రత్యేకంగా స్టాల్స్ ఏర్పాటు చేసి ఆకర్షణీయమైన రాఖీలు విక్రయిస్తున్నారు.

హద్దు దాటితే కఠిన చర్యలు తప్పవు

రౌడీషీటర్లకు పోలీసుల కౌన్సెలింగ్

సీతమ్మధార : ఫోర్తుటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో పలు కేసులతో సంబంధం ఉన్న రౌడీషీటర్లకు సీఐ ఎస్.విజయకుమార్ ఆదివారం కౌన్సెలింగ్ నిర్వహించారు. స్టేషన్ పరిధిలో గల రౌడీషీటర్లను ఆదివారం పిలిపించి మాట్లాడారు. అనంతరం వారి వేలిముద్రలు సేకరించారు. వారి రోజు వారీ కార్యకలాపాలు, సత్ప్రవర్తనతో మెలుగుతున్నారో..? లేదో..? అడిగి తెలుసుకున్నారు. ఈనంతరం సీఐ మాట్లాడుతూ రౌడీషీటర్ల తీరుపై పోలీస్ కమిషనర్ చాలా సీరియస్‌గా వున్నారని స్పష్టం చేశారు. ఎవరైనా హద్దు మీరితే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గతంలో కూడా కొందరు రౌడీషీటర్లను నగర బహిష్కరణ చేశారని గుర్తు చేశారు. సమాజంలో అల్లర్లు చేయకుండా ఉండాలని సూచించారు. తగాదాలు, కొట్లాటల్లో తలదూర్చకుండా కుటుంబాలతో హాయిగా జీవించాలని సూచించారు. తగాదాల్లో తలదూర్చితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రౌడీషీటర్ల కదలికలపై ఎప్పటికప్పుడు పోలీస్ నిఘా ఉంటుందని, మంచిగా జీవించాలని సూచించారు.


రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ చేస్తున్న ఫోర్తుటౌన్ సీఐ విజయకుమార్


రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ చేస్తున్న ద్వారక ఎస్ఐ ధర్మేంద్ర

ద్వారకా స్టేషన్‌లో పరిధిలో... : అల్లర్లు చేయకుండా ఉండాలని రౌడీషీటర్లకు ఎస్ఐ ధర్మేంద్ర సూచించారు. స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లకు ఆదివారం ఆయన కౌన్సెలింగ్ చేశారు. తగాదాలు, కొట్లాటల్లో తలదూర్చొద్దని... అల్లర్లు సృష్టిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

అంధకారంలో గణేష్‌నగర్ రోడ్


సీతంపేట గణేష్‌నగర్ రోడ్‌లో చెట్ల కొమ్మల మాటున వీధి దీపం


అంధకారంలో సీతంపేట గణేష్‌నగర్ సర్వీస్ రోడ్డు

సీతంపేట : జీవీఎంసీ 25వ వార్డు సత్యం జంక్షన్ హైవేకు అనుకుని ఉన్న గణేష్‌నగర్ సర్వీస్ రోడ్‌లో అంధకారం అలుముకుంది. ఈ మార్గంలో ఉన్న వీధి దీపాలు వెలుగుతున్నా చెట్ల కొమ్మలు అడ్డుగా ఉండడంతో వెలుతురు రోడ్‌పై పడక చీకటిగా ఉంటోంది. దీంతో చీకటి పడితే ఈ మార్గంలో నడవడానికి మహిళలు, చిన్న పిల్లలు ఇబ్బంది పడుతున్నారు. వాహనాల హెడ్‌లైట్ల వెలుతురులో రాకపోకలు సాగిస్తున్నారు. చెట్ల కొమ్మలు ఏపుగా పెరగడం వల్ల ఎల్ఈడీ లైట్లకు అడ్డుగా ఉంటున్నాయని, మరికొన్ని విద్యుత్ స్తంభాలకు వీధి లైట్లు లేక, చీకటి పడితే ఈ రోడ్‌లో అంధకారం నెలకొంటోంది. చాలా రోజులుగా ఇబ్బంది పడుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

అప్పన్న అన్నప్రసాద పథకానికి విరాళాలు

సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి ఆదివారం సింహాచలం దరి ప్రహ్లాదపురం ప్రాంతానికి చెందిన మహంతి వెంకటలక్ష్మి ప్రతినిధులు లక్ష 116 రూపాయల విరాళాన్ని, డాబాగార్డెన్స్‌కి చెందిన చెక్కరాజు, ప్రసాద్ కలిసి లక్ష 116 రూపాయల విరాళాన్ని అందజేశారు. సంబంధిత విరాళాలను అన్నప్రసాద విభాగం ఏఈవో పాలూరి నరసింగరావుకి, ప్రోటోకాల్ సీనియర్ అసిస్టెంట్ సూర్యనారాయణకు చెక్కుల రూపంలో అందజేశారు. దేవస్థానం తరఫున దాతల కుటుంబాలకు దేవస్థానం అధికారులు దర్శనం కల్పించి ప్రసాదం, శేషవస్త్రం అందజేశారు.

జూలో రెడ్ నెక్డ్ వాల్లబీ సందడి


యానిమల్ కీపర్‌కు దూరంగా పరుగెడుతున్న రెడ్ నెక్డ్ వాల్లబీ

ఆరిలోవ: ఇందిరాగాంధీ జూ పార్కు ఆదివారం సందర్శకులతో కళకళలాడింది. వన్యప్రాణులు ఎన్‌క్లోజర్లలో హుషారుగా తిరుగుతూ కనువిందు చేశాయి. ఇక్కడ రెడ్ నెక్డ్ వాల్లబీ ఎన్‌క్లోజర్‌లో గెంతులు వేస్తూ.. అటూ ఇటూ పరిగెడుతూ సందర్శకులను మరింతగా ఆకట్టుకుంది. ఇటీవల గుజరాత్ జూ నుంచి ఒక జత రెడ్ నెక్డ్ వాల్లబీని జూ అధికారులు ఇక్కడికి తీసుకొచ్చిన విషయం తెలిసిందే. వాటి కోసం ప్రత్యేకంగా ఎన్‌క్లోజర్‌ను సిద్ధం చేశారు. దానిలో ఆదివారం యానిమల్ కీపర్ ఆహారం(పచ్చని ఆకులు) అందించే సమయంలో వాల్లబీలు పరుగులు తీశాయి. యానిమల్ కీపర్‌కు దూరంగా ఎన్‌క్లోజర్ లోపల అమర్చిన దుంగల మీదుగా ఎగురుతూ పరిగెడుతూ సందడి చేశాయి.

ప్రమాదకరంగా శిథిల కల్వర్టు


ప్రమాదకరంగా ఉన్న కల్వర్టు

సీతమ్మధార : జీవీఎంసీ 24వ వార్డులో గల నక్కవానిపాలెం వివేకానంద కల్యాణ మండపం ప్రవేశమార్గం ప్రమాదభరితంగా తయారైనా జోన్ – 3 ఇంజినీర్లు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడి ప్రవేశ మార్గం వద్ద గల కల్వర్టు శిథిలావస్థకు చేరుకుని ప్రమాదకరంగా మారింది. కల్యాణ మండపం కొన్నాళ్ల కిందట మూత పడిన విషయం తెలిసిందే. కాగా కల్యాణ మండపం పైఅంతస్తులో 24వ వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ కార్యాలయం వుంది. దీంతో సిబ్బంది, పారిశుధ్య కార్మికులు పలు పనుల మీద ఇక్కడికి వస్తున్నారు. ఆర్‌పీ కార్యాలయం కూడా ఇక్కడే వుంది. అలాగే సాయంత్రమైతే మందుబాబులు, గంజాయి బ్యాచ్ ఇక్కడ వాలిపోతున్నారు. సెక్యూరిటీ గార్డు లేకపోవడంతో రోజూ చీకటి పడితే చాలు అసాంఘిక కార్యకలాపాలు జోరుగా సాగుతున్నాయని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఇక్కడి ప్రహరీ గోడకు ఆనుకుని వున్న గేట్లు కూడా వేయలేని పరిస్థితి నెలకొంది. గేటుకి వున్న గెడలు వేసే స్థానంలో కల్వర్టు బాగా దెబ్బతినడమే ఇందుకు కారణం. ఇప్పటికైనా జీవీఎంసీ జోన్ – 3 ఇంజినీర్లు స్పందించి కల్వర్టుకి మరమ్మతులు నిర్వహించాలని, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయాలని పలువురు కోరుతున్నారు.

మనస్తాపంతో మహిళ ఆత్మహత్య

మర్రిపాలెం : అనారోగ్య కారణాలతో ఓ మహిళ మనస్తాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో వెలుగుచూసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... కంచరపాలెం గోకుల్ నగర్‌లో తల్లితో కలిసి పి.రాజేశ్వరి(56) నివసిస్తోంది. ఆమెకు వివాహం జరిగినా తరచూ గొడవలు జరగడంతో చాలా కాలంగా తల్లి దగ్గరే ఉంటుంది. ఈ నేపథ్యంలో అనారోగ్యం కారణంగా ఆమె వైద్యులను సంప్రదించగా క్యాన్సర్ అని నిర్ధారించారు. దీంతో ఇంకా బతకను అని మనస్తాపానికి గురై ఆదివారం తెల్లవారుజామున ఇంటి నుంచి బయటకు వెళ్లి మళ్లీ రాలేదు. సమీపంలోని సుభాష్ నగర్ బావిలో శవమై కనిపించడాన్ని ఉదయం 9 గంటల ప్రాంతంలో స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. అనంతరం కుటుంబ సభ్యులకు సమాచారం అందించగా... ఆమె సోదరుడు శేఖర్ ఫిర్యాదు మేరకు సీఐ ఎస్. భాస్కరరావు నేతృత్వంలో ఏఎస్ఐ ఆదిరాజు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఉత్సాహంగా కళానైపుణ్య పోటీలు



పాట్ పెయింటింగ్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు, ఓ విద్యార్థిని తయారు చేసిన కళాకృతి

కొమ్మాది: శ్రీ కృష్ణ జన్మాష్టమిని పురస్కరించుకుని ఇస్కాన్ మందిరంలో ఆదివారం నిర్వహించిన కళానైపుణ్య పోటీలకు విశేష స్పందన లభించింది. నగరం నలుమూలల్లోని అనేక పాఠశాలల నుంచి వందలాది మంది విద్యార్థులు ఉత్సాహంగా పోటీల్లో పాల్గొన్నారు. కార్యక్రమాన్ని ఇస్కాన్ అధ్యక్షుడు సాంబదాస్ ప్రభూజీ, మాతాజీ నితాయి సేవిని ప్రారంభించారు. వారు మాట్లాడుతూ ఈ నెల 24 నుంచి 27వ తేదీ వరకు ఇస్కాన్‌లో వైభవంగా జన్మాష్టమి వేడుకలు నిర్వహించనున్నామని, ఈ నేపథ్యంలో విద్యార్థుల కోసం పోటీలు నిర్వహించామని తెలిపారు. పాట్ పెయింటింగ్, వ్యాసరచన, డ్రాయింగ్, శ్రీకృష్ణ లీలలపై పరీక్ష, భగవద్గీత శ్లోకాల పారాయణం, వంట, పూల అలంకరణ, రంగోలి పోటీలు నిర్వహించామని, విజేతలకు కృష్ణాష్టమి నాడు బహుమతులు అందజేస్తామన్నారు.

జేసీఐ విశాఖ అచీవర్స్ సెమినార్


సెమినార్‌లో పాల్గొన్న వివిధ సంఘాల ప్రతినిధులు

డాబాగార్డెన్స్: నగరంలోని ఓ హోటల్‌లో జేసీఐ విశాఖ అచీవర్స్ నేతృత్వంలో ఆదివారం ఓరియంటేషన్ సెమినార్ నిర్వహించారు. విశాఖ జోన్ ప్రెసిడెంట్ సురేష్ గొంప సదస్సును ప్రారంభించి మాట్లాడారు. జేసీఐ విశాఖ చాప్టర్ పరిధిలో పనిచేస్తున్న పలు సంఘాల ప్రతినిధులు సేవలు ఏ విధంగా గుర్తించాలి? అవార్డులు ఎలా ఎంపిక చేయాలనే విషయాన్ని సభ్యులకు తెలియజేశారు. మేనేజ్‌మెంట్ జెడ్ డి.రూప సిరిపూరి మాట్లాడుతూ జూనియర్ చాంబర్ ఇంటర్నేషనల్ ప్రస్తుతం ఎన్నో సేవా కార్యక్రమాలు చేపడుతోందని, వాటిని ప్రజలకు వివరించడంతోపాటు అవార్డులు అందుకునే స్థాయికి ఏ విధంగా తీసుకెళ్లాలనే అంశంపై జేసీఐ అచీవర్స్ ప్రెసిడెంట్ దిలీప్ కుమార్ నేతృత్వంలో శిక్షణ అందివ్వడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో జేసీఐ వైస్ ప్రెసిడెంట్ అనురాధ్ సిస్టలా, జోనల్ చైర్‌పర్సన్ సింధూర తాడి, ప్రాజెక్ట్ డైరెక్టర్ సోమశేఖర్, బి.దిలీప్‌కుమార్, రంజిత్ షా, డాక్టర్ శీతల్ మదన్, ఉమా, శ్రీదేవి, విజయ కిరణ్, పర్వీన్, చంద్రశేఖర్, ప్రేరణ మదన్ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన సినీ సంగీత విభావరి


జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కళారంగ ప్రముఖులు

డాబాగార్డెన్స్ : స్వరమాలిక సంగీత సంస్థ అధ్యక్షుడు గిన్ని ఆంజనేయరెడ్డి నేతృత్వంలో ఆదివారం సాయంత్రం అల్లూరి విజ్ఞాన కేంద్రంలో 'నా మదిలో నీవే ఉంటే' పేరిట నిర్వహించిన సినీ సంగీత విభావరి ఆకట్టుకుంది. ముందుగా స్టేట్ సోషల్ మీడియా చైర్మన్ సన్‌మూర్తి, కళాకారుల సంఘం కార్యదర్శి చెన్నా తిరుమలరావు, రంగారావు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. గాయకులు కృష్ణంరాజు, పోతురాజు, శ్రీనివాస్, ఏవీఎస్ రెడ్డి, శైలజ, గుణశ్రీ, పూర్ణిమ, మాధురి, సుజాత, సావిత్రి, నర్సింగ్, రాంబాబు, అప్పారావు తదితరులు ప్రజాదరణ పొందిన చిత్ర గీతాలు ఆలపించారు. కీబోర్డ్‌పై సోమేశ్, తబలాపై ధనుంజయ్, అప్పలరాజు, ప్యాడ్స్‌పై బాబ్జి చక్కని సంగీతాన్ని అందివ్వగా లక్ష్మీ స్వరూప వ్యాఖ్యాతగా వ్యవహరించారు.